క్లుప్తంగా

నేడు నౌతళలో గడపగడపకు మన ప్రభుత్వం

సారవకోట: మండలంలోని మాకువ సచివాలయం పరిధిలోని నౌతళ పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

పరామర్శ..



జెడ్పీటీసీ భాగ్యవతిని పరామర్శిస్తున్న కిల్లి కృపారాణి, రామ్మోహన్‌రావు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన కొత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి భర్త త్రినాథరావు ఇటీవల మెళియాపుట్టి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుంటిభద్ర గ్రామానికి బుధవారం మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, రామ్మోహన్‌రావు దంపతులు వెళ్లి జెడ్పీటీసీ భాగ్యవతిని పరామర్శించారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామన్నారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రెండు రోజులపాటు జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ముగిశాయని ఎంఈఓ, కరకవలస పీడీ డి.యశోద బుధవారం తెలిపారు. మండల స్థాయిలో జరిగిన అండర్ 14, 17 విభాగాల్లో విజేతలైన వారు త్వరలో జరిగే నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పాలక రామారావు పాల్గొన్నారు.

భౌపెడుతున్నాయ్..



నందికొండ కాలనీలో సంచరిస్తున్న కుక్కల గుంపు

సరుబుజ్జిలి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. వీధుల్లోకి అడుగు పెట్టాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఇటీవల కాలంలో వెన్నెలవలస, నందికొండ, పాలవలస, పెద్దపాలెం గ్రామాల్లో పలువురు కుక్కకాటుకు గురయ్యారు. పశువులపై కూడా మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుడివీధి ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం వద్ద గల గంగామాత ఆలయంలో సుబ్రమణ్యస్వామికి బుధవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు చేపట్టారు. అర్చకులు పెంట కిరణ్ శర్మ స్వామివారికి అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

వాత్సల్యగ్రేసికి అభినందన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏ ఆధారము లేకుండా బతుకు సాగిస్తున్నవారికి ఆసరాగా నిలుస్తున్న ఇక్రా ఫౌండేషన్ సేవలు ప్రసంశనీయమని డీఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఇక్రా ఫౌండేషన్‌కు దాతల నుంచి విరాళాలు సేకరించడంలో ఎంతో సహకరిస్తున్న వాత్సల్యగ్రేసిని బుధవారం సత్కరించారు. వాత్సాల్య మడపం గ్రామానికి చెందిన పాలకొండ శివకుమార్ కుమార్తె వాత్సల్య గ్రేసి చిన్న వయస్సులో సమాజ అభ్యున్నతి కోసం చేస్తున్న కృషిని మెచ్చుకున్నారు. బలగ ప్రసాద్, మానవ హక్కుల కార్యకర్త లోసు భూషణరావు, వాత్సల్యగ్రేసి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముకుందా.. మురారీ

- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో కృష్ణాష్టమి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సరుబుజ్జిలి: మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను పీఠంపై ఏర్పాటు చేసి పూజలు, అర్చనలు చేశారు. తదుపరి ఉయ్యాలలో వేసి భక్తగేయాలు ఆలపించారు. ఈ వేడుకల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: స్థానిక మఠం వీధిలో శ్రీకృష్ణాష్టమిని విశ్వభారతి స్కూల్ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే విన్యాసాల్లో విద్యార్థులు సందడి చేశారు. కృష్ణుడు, గోపికల వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ వేడుకలను నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వైశ్యరాజు కేశవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గనగళ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే వేంకటేశ్వరాలయం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. సంఘం ప్రతినిధి ఈగల వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్యామలాపురం గ్రామంలో భగవాన్ సత్యసాయి సేవా మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. పలువురు చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుని వేషధారణల్లో అలరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు ఎ.నారాయణరావు, లావేటి శైలజ, లావేటి చిన్నికృష్ణ, టి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో శ్రీకృష్ణుని మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

బూర్జ: మండలంలోని అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. బూర్జలోని శ్రీకృష్ణ భగవాన్ విగ్రహానికి పూజలు చేపట్టారు. భక్తులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బూర్జ: బూర్జలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు



నరసన్నపేట: విశ్వభారతి స్కూల్ ఆవరణలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఎల్.ఎన్.పేట:శ్యామలాపురంలో అలరించిన చిన్నారుల వేషధారణలు

కనుమరుగవుతున్న దంతపురి కోటగట్టు!



గట్టును తవ్విన దృశ్యం

సరుబుజ్జిలి: దంతపురికోట గట్టును ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేయడం వల్ల రూపురేఖలు కనుమరుగవుతున్నాయి. రొట్టవలస, పాలవలస, రావివలస, పెద్దపాలెం, చిన్నపాలెం గ్రామాల మధ్య విస్తరించి ఉంది. దంతపురికోట కోటకు రక్షణగా నలుదిశలా విస్తరించి ఉన్న గట్టును కొంతమంది మట్టి వ్యాపారులు, రియల్టర్లు తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల కోట ఆనవాళ్లు పూర్తిగా కోల్పోతున్నాయి. మరికొంతమంది గట్టును తవ్వకంచేసి పొలాలుగా మార్చి వాటిపై వాణిజ్య పంటలు పండిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి దంతపురి కోట గట్టును పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వకాలు చేసేవారిపై చర్యలు

ప్రాచీన సంపదగా విరాజిల్లుతున్న దంతపురిక్షేత్రంలో మట్టి తవ్వకాలు చట్టరీత్యా నేరం. కోట గట్టు తవ్వకాలు చేసినవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం.

– డి.పద్మావతి, ఇంచార్జ్ తహసీల్దార్, సరుబుజ్జిలి

స్పీకర్‌ను కలిసిన ఐసీడీఎస్ పీడీ



స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

ఆమదాలవలస: జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన బగాది శాంతిశ్రీ బుధవారం ఆమదాలవలస పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద స్పీకర్ తమ్మినేని సీతారాంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె గతంలో జిల్లాలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. స్పీకర్ మాట్లాడుతూ చిన్నారులకు పూర్తిస్థాయిలో సేవలు అందించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషిచేయాలని శాంతిశ్రీకి సూచించారు.

10న స్వరసుధ గాత్ర కచేరీ

శ్రీకాకుళం కల్చరల్: తరుణికృష్ణ స్మారక ధార్మిక ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన స్వరసుధ శాస్త్రీయ గాత్ర సంగిత కచేరీ జరుగుతుందని నిర్వాహకులు మండ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన గురువైన స్వర్గీయ మండ కృష్ణ రామ్‌ప్రసాద్ జయంతి సందర్భంగా విశాఖకు చెందిన ప్రాతా కృష్ణమూర్తితో స్వరసుధ, లక్ష్మీ గణపతి శర్మతో వాయులీన వాదనం కార్యక్రమం ఉంటుందన్నారు.

చురుగ్గా ఆధార్ సీడింగ్

నరసన్నపేట: విద్యుత్ పంపిణీ సంస్థల ఆదేశాల మేరకు మండలంలోని టౌన్, రూరల్ పరిధిలో ఉన్న విద్యుత్ మీటర్లకు ఆధార్ సీడింగ్ ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. ఇప్పటివరకు మండలంలో 53 శాతం వినియోగదారులు తమ విద్యుత్ సర్వీస్ నంబర్‌తో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకున్నారు. మరో 10 రోజుల కల్లా ఆధార్ సీడింగ్ పూర్తిచేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలు కింది స్థాయి సిబ్బందికి ఆదేశించడంతో ఈ మేరకు ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. టౌన్ ఏఈ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ పేరున ఉన్న సర్వీస్ నంబర్‌తో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. తమ పరిధిలోని గ్రామ, వార్డు వలంటీర్లకు సర్వీస్ నంబర్ బిల్లు రసీదు, ఆధార్ జిరాక్స్ ఇవ్వాలని కోరారు. నరసన్నపేట టౌన్‌లో 15,400, రూరల్ పరిధిలో 13,200 విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు.



పంచాయతీ కార్యాలయం వద్ద ఆధార్ నంబర్లను అనుసంధానం చేస్తున్న వలంటీర్లు, విద్యుత్ సిబ్బంది

భారీ వర్షం..

- మెట్ట పొలాలకు ఉపయోగం
- రహదారులు జలమయం
- మహేంద్రతనయకు పెరిగిన వరదనీరు



మెళియాపుట్టి: మహేంద్ర తనయ నదినుంచి ప్రవహిస్తున్న నీరు

మెళియాపుట్టి: మండలంలో గత కొన్నిరోజులుగా వర్షాలు లేక రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. వరి పంటలు ఎండిపోతున్న సమయంలో ఈ వర్షం ఊపిరి పోసిందని మండలంలోని పెద్దపద్మాపురం, సిరియాఖండి, భరణికోట గ్రామానికి చెందిన రైతన్నలు చెబుతున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఉన్న మహేంద్రతనయ నదికి వరద తీవ్రత పెరిగింది. చాపర గ్రామం వద్ద రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు.

వర్షం..హర్షం..

ఆమదాలవలస రూరల్: మండలంలో బుధవారం వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం కనిపించింది. ఈ వర్షం మెట్ట ప్రాంతాల రైతులకు మేలు చేకూర్చింది. సాగునీరు సక్రమంగా అందకపోవడంతో వరి ఊభాలు ఆలస్యంగా వేసిన రైతులకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. మండలంలో జొన్నవలస, అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట, చింతలపేట, దివంజీపేట, దన్నానపేట, బొబ్బిలిపేట తదితర గ్రామాల శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో ఆలస్యంగా వరి ఊభాలు వేశారు. వరి ఊభాలు వేసిన తరువాత వర్షం జాడ లేకపోవడంతో ఎండిపోయే స్థితికి వచ్చాయి. ఈ సమయంలో భారీ వర్షం కురవడంతో పంట పొలాల్లో నీరు చేరింది.

చెరువులు, కాలువలు జలమయం

సరుబుజ్జిలి: మండలంలో బుధవారం ఏకధాటిగా కురిసిన వర్షానికి పంట పొలాలు, కాలువలు, రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. నీరులేక ఎండిపోతున్న పొలాలకు ఈ వర్షం చాలా ప్రయోజనం ఉంటుందని రైతులు ఆనందపడుతున్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావం వల్ల గత మూడు రోజులుగా వర్షాలు కురిస్తున్నాయి. పొలాలు వర్షం నీటితో నిండాయి.



బూర్జ: డొంకలపర్త గ్రామ రహదారిపై ప్రవహిస్తున్న వర్షంనీరు



మెళియాపుట్టి: చాపరలో రహదారిపై ప్రవహిస్తున్న నీరు



ఆమదాలవలస రూరల్: అక్కులపేటలో వరి ఊబాలు వేసిన పొలంలో చేరిన వర్షపు నీరు



సరుబుజ్జిలి: వర్షంనీటితో నిండిన సరుబుజ్జిలి జంక్షన్

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పింఛన్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- అర్హులందరికీ పంఛన్లు అందజేస్తున్నాం
- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: నియోజకవర్గంలో అర్హత ఉన్న వారందరికీ పింఛన్లను అందిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన 227 పింఛన్లను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో వార్డుల వారీగా పింఛన్లను పొందేందుకు అర్హులను గుర్తించాలని సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్జీలు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సురక్షలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను అందజేశామన్నారు. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు, ధ్రువపత్రాలు అందడంలో సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే పరిష్కరించి పథకాలు అందిస్తున్నామన్నారు. ఏడాదికి 38 సార్లు పలు సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ బటన్‌పై నొక్కి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఏపీలో గ్రామ వలంటీర్ ప్రభుత్వం నడుస్తోందని, తానొక వలంటీర్‌ని అని సీఎం జగన్ కూడా చెబుతున్నారన్నారు. టీడీపీ నాయకులు విచిత్ర వేషాలతో గ్రామాల్లోకి వచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొంచాడ రమణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, వైస్ ఎంపీపీలు వండాన వెంకటరావు, కాకర్ల రాజారావు, బాడాన సునీల్, కిల్లాన సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

సారవకోట: అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మాజీ సర్పంచ్ నక్క రామరాజు, పార్టీ నాయకులు మామిడి కాంతారావు ఆధ్వర్యంలో మండలంలోని నౌతళ సచివాలయ పరిధిలోని మాకువ, సవరమాకువ, కాలనీ మాకువ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలు గుర్తించి ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ ధర్మాన పద్మప్రియ, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, సర్పంచ్ జన్ని అనిరుద్రుడు, కొండాల బాబూరావు, శంకరబాబు, సాగిపల్లి దండాశి, బాడాన కృష్ణారావు, మాజీ సర్పంచ్ కాళ్ల సింహాచలం, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, పార్టీ నాయకులు రంజిత్, గోవిందరావు, నక్క తులసీదాస్, యాళ్ల శ్యామసుందరరావు, నిక్కు రాజశేఖర్, మెండ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: దేశంలో గత ముఖ్యమంత్రులు ఎవరూ చేయని గొప్ప ఆలోచన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేశారని, ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని గూనభద్రలో నూతన సచివాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని సుమారు 2 వేల మంది ప్రజలకు రూ.40 లక్షలతో ఒక సచివాలయ భవనాన్ని నిర్మించి, 12 మంది సిబ్బందిని నియమించి ప్రజల వద్దకే సేవలు అందజేస్తున్నారన్నారు. ఇటువంటి గొప్ప ఆలోచన ఎవరూ చేయలేదన్నారు. సచివాలయాలు, గ్రామ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుచేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజల అవసరాలు తీర్చకుండా.. పేద ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పేవారన్నారు. టీడీపీ జెండా మోసేవారికే జన్మభూమి కమిటీల ద్వారా పథకాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పెద్దకోట సాధుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కళ్లపల్లి వాణి, వైకుంఠరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఫిర్యాదు

ఆమదాలవలస రూరల్: అర్ధ రాత్రి సమయంలో ఇంటి తలుపులు కొట్టి వ్యక్తిగత దూషణలు చేసిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గాజులకొల్లివలసకు చెందిన గేదెల జయలక్ష్మి బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో గాజులకొల్లివలస గ్రామ పంచాయతీకి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ కుటుంబం సంగమేశ్వర ఆలయం వద్ద నివాసం ఉంటుంది. అదే ప్రాంతంలో గాజులకొల్లివలస ఆర్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న సొండి రమేష్ మంగళవారం అర్ధ రాత్రి మద్యం తాగి తన ఇంటి వద్దకు వచ్చి తలుపులు కొట్టి దూషణలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా తక్షణమే పోలీస్ సిబ్బంది వచ్చి వివరాలు సేకరించారన్నారు. మరలా తలుపులు కొట్టి భయాందోళనకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారన్నారు. అర్ధ రాత్రి సమయంలో కుటుంబం అంతా భయంతోనే గడిపామని, దూషణలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. రమేష్ అనే వ్యక్తి గతంలో సంగమేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ధ్వంసం చేశాడని, ఈ వ్యక్తి వల్ల అనేకసార్లు ఇబ్బంది పడ్డామని ఫిర్యాదులో తెలిపారు. ఆయనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.